క్లుప్తంగా

నేడు నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం

గిద్దలూరు రూరల్: నగర పంచాయతీ కార్యాలయంలో నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 11 గంటలకు కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు స్థానిక కమిషనర్ డి.వెంకటదాసు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు హాజరు కావాల్సిందిగా కోరారు.

చిల్లకంపను తొలగించాలి



రోడ్డుకు ఇరువైపులా అల్లుకున్న చిల్లకంప

రాచర్ల: మండలంలోని శీలంవెంకటరెడ్డిపల్లె వెళ్లే రోడ్డుకు ఇరువైపులా చిల్లకంప అల్లుకుని పోవడంతో ఆమార్గంలో వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పాలకవీడు క్రాస్ రోడ్డు నుంచి శీలంవెంకటరెడ్డిపల్లె గ్రామానికి వెళ్లే రోడ్డు మార్గం అంతటా చిల్లకంపతో నిండిపోయింది. మూల మలుపు వద్ద చిల్లకంప అల్లుకునిపోవడంతో వచ్చే పోయే వాహనాలు, ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించక చిన్నపాటి ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని అల్లుకున్న చిల్లకంపను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఖైదీలకు మౌలిక వసతులపై శ్రద్ధ చూపాలి



వివరాలు తెలుసుకుంటున్న న్యాయసేవాధికారి

గిద్దలూరు రూరల్: జైలులో ఉంటున్న ఖైదీలకు ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక వసతులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ కె.శ్యామ్‌బాబు అన్నారు. పట్టణంలోని స్థానిక సబ్‌జైలును మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జైలు రికార్డులను పరిశీలించారు. క్షణికావేశంలో నేరాలకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకున్న ఖైదీల పై బాధ్యతగా ప్రవర్తించాలని జైలు సిబ్బందికి సూచించారు. వారిపై చులకన భావం చూపరాదన్నారు. ఈ సందర్భంగా ఖైదీలకు చట్టాల పై అవగాహన కల్పించారు. ఉచితంగా న్యాయసేవలు పొందే అవకాశాలున్నాయని వివరించారు.

అన్నా క్యాంటిన్ ఆకస్మిక తనిఖీ



అన్నా క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

గిద్దలూరు రూరల్: పట్టణంలోని అన్నా క్యాంటిన్‌ను స్థానిక కమిషనర్ డి.వెంకటదాస్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అన్నా క్యాంటీన్‌లో ఆహారం తీసుకుంటున్న వారిని నాణ్యత పై అడిగి తెలుసుకున్నారు. క్యాంటీన్ ఆహారం పై నాణ్యత ప్రమాణాలు పాటించాలని అలాగే శుభ్రత పరిశుభ్రత పాటించాలని సూచించారు. నరవ రోడ్డు, నల్లబండ బజారులోని పారిశుద్ధ్య పనులను పరిశీలించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బేస్తవారిపేట: మండలంలోని మోక్షగుండం 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్‌లో మరమ్మతుల పనులు జరుగుతుండటంతో బుధవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ ఏఈ సన్యాసిరావు తెలిపారు. మోక్షగుండం, పందిళ్లపల్లె, పెంచికాలపాడు, పూసలపాడు గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

వెలుగు సిబ్బందిపై విచారణ



వివరాలు సేకరిస్తున్న అధికారులు

కంభం: స్థానిక వెలుగు కార్యాలయంలో పని చేస్తున్న సీసీ ఫాతిమా, కందులాపురం వీవోఏ తాహెరా పై వచ్చిన ఫిర్యాదుల మేరకు మంగళవారం డీఆర్‌డీఏ ఐబీ డీపీఎం సీహెచ్ నరసింహారావు, ఏరియా కోఆర్డినేటర్ కె.లక్ష్మి రెడ్డి విచారణ చేపట్టారు. ఇద్దరినీ పిలిచి విచారించిన అనంతరం ఫిర్యాదుదారులను, గ్రూపు సభ్యులను విచారించి వివరాలు సేకరించారు. వీఓఏ 3 సంవత్సరాల వరకు ఒకే చోట విధులు నిర్వహించవచ్చని, సీసీలు 5 సంవత్సరాల వరకు మండలంలోని ఒక క్లస్టర్‌లో పని చేయవచ్చన్నారు. సొంత మండలం అయి ఉండకూడదన్నారు. విచారణ రిపోర్టును పూర్తి స్థాయిలో పరిశీలించి రెండు రోజుల్లో చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పేలిపోతున్న టపాసుల ధరలు

● గతేడాది కంటే పెరిగిన ధరలు

టపాసుల ధరలు ఇలా..

	గతేడాది ధర	ప్రస్తుత ధర
కాకర పుల్లల బాక్స్	1200	1300
చిచ్చుబుడ్ల బాక్స్	280	320
లక్ష్మీబాంబులు చిన్నవి	350	380
లక్ష్మీబాంబులు పెద్దవి	450	550
ఫ్లవర్ ఆటమ్ బాక్స్	200	250
వంకాయబాంబ్‌లు	200	250
100 వాలా	60	90
1000 వాలా	200	250
10000 వాలా	2800	3300
రాకెట్ బాక్స్	400	450
భూచక్రాలు బాక్సు	190	220
మతాబుల బాక్స్	150	200



ఓ దుకాణంలో విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న టపాసులు

మార్కాపురం: మార్కాపురం, పొదిలి, తర్లుపాడు, కొనకనమిట్ల మండలాల్లో దీపావళి టపాసుల ధరలు చూస్తే అగ్గి పెట్టకముందే పేలిపోతున్నాయి. తమిళనాడులోని శివకాశీ, మన రాష్ట్రంలోని విజయవాడ, గుంటూరు, చిలకలూరిపేట తదితర ప్రాంతాల నుంచి టపాసులు దిగుమతి అవుతున్నాయి. గతేడాది కంటే ఈ ఏడాది ధరలు 30 శాతం మేర పెరిగాయి. రంగుల హరివిల్లు కురిపించే టపాసులు పెరుగుతున్న ధరలతో నామమాత్రంగా ప్రజలు కొనుగోలు చేసి దీపావళిని జరుపుకోనున్నారు. గురువారం దీపావళి పండగ నేపథ్యంలో మార్కాపురం పట్టణంలో దాదాపు 23 షాపుల్లో దీపావళి మందులు విక్రయించేందుకు అధికారులు తాత్కాలిక లైసెన్స్‌లు మంజూరు చేశారు. వీరందరూ మార్కాపురం పట్టణంలోని ఎస్‌వీకేపీ కళాశాల ప్రాంగణంలో తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేసుకుని అమ్ముతారు. దీపావళి పెద్దల కంటే పిల్లలకు ఎంతో ఉత్సాహం ఇస్తుంది. టపాసులు కొనుగోలు చేసి ఇంటిల్లపాది కాలుస్తూ ఆనందంగా గడుపుతారు. మార్కాపురం, పొదిలి, తర్లుపాడు, కొనకనమిట్ల మండలాల్లో సుమారుగా 30 షాపులు ఏర్పాటు చేస్తున్నారు. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది 20 నుంచి 30 శాతం రేట్లు పెరిగాయి.

దరలు ఇలా ఏటేటా పెరిగిపోవటంతో పిల్లల ఆనందం ఎలా ఉన్నా పెద్దలు మాత్రం హడలిపోతున్నారు. అసలే పెరిగిన ధరలతో వినియోగదారులు అల్లాడుతుంటే ఇదీ చాలదనట్లుగా జీఎస్టీ తోడు కావటంతో ప్రజల ఆనందం కొద్దిగా తగ్గించుకుని టపాసులు కొనుగోలు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

టపాసులు అనధికారికంగా విక్రయిస్తే చర్యలు:



దీపావళి సందర్భంగా టపాసులు అనధికారికంగా అమ్మినా, గోడౌన్లలో నిల్వ ఉంచినా చర్యలు తీసుకుంటాం. షాపుల వద్ద నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలి. ఇసుక, నీటి సౌకర్యం ఏర్పాటు చేసుకోవాలి. ప్రమాదం జరిగితే వెంటనే ఫైర్, పోలీసులకు సమాచారం అందించాలి. ఆటమ్ బాంబులు, చిచ్చుబుడ్లు కాల్చేటప్పుడు తల్లిదండ్రులు పక్కన ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. టపాసులు కాల్చేటప్పుడు జాగ్రత్తలు పాటించండి. చిన్న పిల్లలను దూరంగా ఉంచండి.

సుబ్బారావు, సీఐ, మార్కాపురం

దుకాణాల వద్ద జాగ్రత్తలు తప్పనిసరి:



తాత్కాలిక లైసెన్సులు పొందిన వ్యాపారులు ఈ నెల 29,30,31వ తేదీల్లో మాత్రమే దీపావళి టపాసులు అమ్మాలి. జనావాసాల మధ్య మందులు అమ్మితే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతాం. షాపు షాపునకు మధ్య దూరం 3 మీటర్లు ఉండాలి. 200 లీటర్ల డ్రమ్ముల్లో నీటిని సిద్ధం చేసుకోవాలి. ఇసుక బస్తాలు సమీపంలో ఉంచుకోవాలి. ప్రమాదవశాత్తు ఏదైనా జరిగితే వెంటనే అగ్నిమాపక శాఖాధికారులకు ఫోనులో చెప్పడంతో పాటు అధికారుల నంబర్లు కూడా షాపుల వద్ద డిసిప్లే చేయాలి. గడ్డివాములు, పూరిగుడిసెల వద్ద టపాకాయలు కాల్చవద్దు.

రామకృష్ణ, ఫైర్ ఆఫీసర్, మార్కాపురం

కంభంలో ట్రాఫిక్ జంఝాటం



చౌక్ సెంటర్‌లో సరుకుల అన్‌లోడ్‌కు ఆగి ఉన్న లారీ



బస్టాండులో బస్సులకు అడ్డంగా ఆపి ప్రయాణికులను ఎక్కించుకుంటున్న ఆటో



బస్టాండు వద్ద ట్రాఫిక్ జామ్

- ఆక్రమణలతో కుంచించుకుపోతున్న రహదారులు
- చౌక్ సెంటర్‌లో పెద్ద వాహనం వస్తే దాటలేని పరిస్థితి
- బస్టాండులో రోడ్లపైకి దుకాణాలు.. నిలిచిపోతున్న వాహనాలు
- హైవే ఫుట్‌పాత్‌లపై వెలుస్తున్న దుకాణాలు
- పట్టించుకోని అధికారులు

కంభం: రోడ్ల మార్జిన్లు ఆక్రమణలతో కుంచించుకుపోతుండటంతో కంభం పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రతరమవుతోంది. ప్రధానంగా నిత్యం రద్దీగా ఉండే చౌక్‌సెంటర్, సర్కిల్ కార్యాలయం సమీపంలో హోల్‌సేల్ దుకాణాలు, దుస్తుల దుకాణాలు, కూరగాయల మార్కెట్ ఉండటంతో ఈ మార్గంలోకి లారీలు, ఇతర పెద్ద వాహనాలు సరుకులు దించేందుకు వస్తుంటాయి. చౌక్‌సెంటర్‌లో లారీ కానీ ఇతర ఏదైనా పెద్దవాహనం ఆగితే కనీసం ఆటో కూడా ముందుకు వెళ్లలేని పరిస్థితి. లారీలు ఆగిన సమయంలో అంబులెన్స్‌లు వస్తే వారికి తిప్పలు తప్పడం లేదు. చౌక్‌సెంటర్లో రోడ్డుకు ఇరువైపులా దుకాణాల్లోని వస్తువులను ప్రదర్శనకు ఉంచడం, వాహనాలు నిలిపేస్తుండటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. ఈ మార్గంలో ప్రతిరోజు ఉదయం సాయంత్రం సుమారు 20 స్కూల్ బస్సులు తిరుగుతుంటాయి. పిల్లలను ఎక్కించుకుంటూ దించే సమయంలో బస్సులు ఆపినప్పుడు వెనుక ట్రాఫిక్ జామ్ అవుతుండటంతో వెనక వచ్చే వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. హైవే వెంట ఫుట్‌పాత్‌లను సైతం ఆక్రమించుకొని దుకాణాలు పెట్టుకోవడం, వాహనాలు పార్కింగ్ చేసుకోవడం, భవనాల ముందు ఉన్న ప్రభుత్వ స్థలాలను యజమానులు చిరువ్యాపారులకు అద్దెలకు ఇస్తుండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది.

ఆటోలతో ఆర్టీసీ ఆదాయానికి గండి

ఆర్టీసీ బస్టాండ్ పరిసరాల్లో ఆటోలు ఇష్టానుసారంగా నిలిపేస్తున్నారు. బస్టాండ్‌లో బస్సులకు ఎదురుగా ఆటోలు ఆపుతుండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. మార్కాపురం, గిద్దలూరు, అర్ధవీడు వైపునకు ప్రయాణికులు ఎక్కువగా తిరుగుతుంటారు. ఆర్టీసీ బస్సులకు ఎదురుగా ఆటోలు ఆపుకొని దర్జాగా ప్రయాణికులను ఎక్కించుకొని పోతుండటంతో ఆర్టీసీ ఆదాయానికి భారీగా గండి పడుతున్నా ఆర్టీసీ అధికారులు మాత్రం స్పందించడం లేదు. బస్టాండ్ పరిసరాల్లో ముందుకొచ్చిన నిర్మాణాలు, రేకుల షెడ్లు తొలగించాలని గతంలో హడావుడి చేసిన అధికారులు మళ్లీ వదిలేయడంతో ట్రాఫిక్ సమస్య మరింత జటిలంగా మారిపోయింది. అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

గొట్టిపడియ టన్నెల్‌ను పరిశీలించిన మంత్రులు

మార్కాపురం రూరల్: మండలంలోని గొట్టిపడియ గ్యాప్ వద్ద జరుగుతున్న టన్నెల్ పనులను మంగళవారం రాష్ట్ర మంత్రులు నిమ్మల రామానాయుడు, గొట్టిపాటి రవికుమార్, డోలా బాలవీరాంజనేయ స్వామి పరిశీలించారు. ప్రాజెక్టు వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం వారు గొట్టిపడియ గ్యాప్, ఇంటెక్‌వెల్ ట్యాంకులను పరిశీలించారు.

మంత్రికి నిర్వాసితుల వినతి

ముంపునకు గురవుతున్న తమ గ్రామాల్లోని ప్రజలకు ఆర్‌ఆర్ ప్యాకేజీ వెంటనే అందించాలని గొట్టిపడియ గ్రామ నిర్వాసితులు తుమ్మా వెంకటరెడ్డి, తుమ్మా పిచ్చిరెడ్డి, సుబ్బారెడ్డి, మహేందర్‌రెడ్డి తదితరుల ఆధ్వర్యంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుక వినతిపత్రం అందించారు. ప్రస్తుతం తమ గ్రామంలో ఇళ్లు, రోడ్లు పూర్తిగా అధ్వానంగా ఉన్నాయని, ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని కోరారు. ఇంకా గ్రామంలో 45 ఎకరాలకు నష్టపరిహారం ఇవ్వాల్సి ఉందని, 60 ఇళ్ల వారికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ చెల్లించాలని కోరారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ముగ్గురు మంత్రులు వెలుగొండ ప్రాజెక్టుకు సందర్శనకు రావడంతో మార్కాపురం సీఐ సుబ్బారావు ఆధ్వర్యంలో పట్టణ, రూరల్ ఎస్సైలు సైదుబాబు, అంకమరావు, రాజమోహన్‌రావు, అహరోన్‌లతో పాటు సిబ్బంది భారీస్థాయిలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

వెలుగు సీసీకి మెమో జారీ

రాచర్ల: డ్వాక్రా గ్రూపులో అక్రమంగా నిధులు డ్రా చేసేందుకు సహకరించిన రాచర్ల వెలుగు కార్యాలయంలో సీసీగా పనిచేస్తున్న షేక్ నాయబ్‌రసూల్‌కు మెమో జారీ చేసినట్లుగా ఏపీఎం పి.రమేష్‌బాబు తెలిపారు. అనుమలవీడు గ్రామానికి చెందిన అంకితగ్రూప్‌లోని సభ్యురాలైన ప్రవళికకు రూ.53 వేలు డ్వాక్రా గ్రూపు నిధులు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. నిధులు డ్రా చేసిన అనుమలవీడు వీవోఎల్ భాగ్యలక్ష్మిని ఈ నెల 21వ తేదీ సస్పెండ్ చేయగా, 19వ తేదీన వెలుగు సీసీ షేక్ నాయబ్‌రసూల్‌కి మెమో జారీ చేసినట్లు ఏపీఎం తెలిపారు. స్త్రీ నిధి నిధులతో పాటు, డ్వాక్రా గ్రూపుల్లో ఇంకా ఏమైనా నిధుల దుర్వినియోగంపై విచారణ చేస్తున్నట్లు ఏపీఎం పి.రమేష్‌బాబు తెలిపారు. రాచర్ల వెలుగు కార్యాలయాన్ని గిద్దలూరు క్లస్టర్ ఏరియా కోఆర్డినేటర్ లక్ష్మిరెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. నిధుల గోల్‌మాల్‌తో అవినీతికి పాల్పడిన వారిని విచారించి తగు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.


ఏపీటీఎఫ్ మండల శాఖ ఏర్పాటు



ఎంఈఓను కలిసిన ఏపీటీఎఫ్ సభ్యులు

కొనకనమిట్ల: ఏపీటీఎఫ్ మండల శాఖ నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీంగా ఎన్నుకున్నారు. మండల శాఖ అధ్యక్షుడిగా తాళ్లూరి రామారావు, ప్రధాన కార్యదర్శిగా తోట యోగిరాములుతో పాటు మరికొంత మంది సభ్యులను కూడా ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాసులు పర్యవేక్షణలో మండల శాఖను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నూతనంగా ఏర్పడిన కమిటీ సభ్యులు మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. అనంతరం ఎంఈఓ డాంగేషరీఫ్‌ను కలిసి ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్‌లు ఎస్‌కే ఖాదర్‌బాషా, కె.శ్రీనివాసరావు, మంచికల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉద్యానవన పంటల విస్తీర్ణం పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఉద్యానవన శాఖాధికారి విష్ణుప్రియ

కొమరోలు: ఉద్యానవన పంటల విస్తీర్ణాన్ని రైతులు పెంచి సాగు చేయాలని ఉద్యానవన శాఖ అధికారిణి విష్ణుప్రియ తెలిపారు. మండలంలోని రెడ్డిచెర్ల, సూరవారిపల్లె గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ అధికారిణి రాజశ్రీ మాట్లాడుతూ కంది, వరి, జొన్న పంటల్లో చీడపీడల నివారణకు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. శనగ పంటలో విత్తనశుద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎంఐపీ ఏరియా ఆఫీసర్ మోహనకృష్ణ పాల్గొన్నారు.

ఆధార్ సెంటర్లు ఎక్కడ?

కొనకనమిట్ల: మార్కాపురం నియోజకవర్గంలో పలు గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆధార్ అనుసంధానం, పుట్టిన తేదీలు, ఆధార్‌లో ఇంటి పేర్లు మార్చుకొనేందుకు గ్రామ సచివాలయ కేంద్రాల్లో ప్రత్యేక ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. కొనకనమిట్ల మండలంలో మాత్రం ఎక్కడా ఆ ఊసే కనపడలేదు. మండలంలో మొత్తం 26 గ్రామ పంచాయతీలకు సంబంధించి 18 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. కొన్నిచోట్ల కూడా ఆధార్ క్యాంపులు నిర్వహించలేదు. క్యాంపులు పెట్టడంతో బయోమెట్రిక్ అప్‌డేషన్, న్యూ ఎన్‌రోల్‌మెంట్, ఆధార్ మొబైల్ లింక్, చిన్న పిల్లలకు ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ తదితర సేవలు పొందే అవకాశం లేకుండాపోయింది. మరి ఉన్నతాధికారులు కొనకనమిట్ల మండలంలో ఎక్కడా ఆధార్ క్యాంపులు నిర్వహించక పోడటంపై మండల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఎంపీడీఓ ఈశ్వరమ్మను వివరణ కోరగా తామైతే క్యాంపులు నిర్వహించేందుకు ఇబ్బంది లేదని, జిల్లా అధికారుల నుంచి ఆధార్ క్యాంపులపై ఎటువంటి సమాచారం లేదన్నారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ఆధార్ కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ అన్నారు.

రీసర్వేపై గ్రామసభ

తర్లుపాడు: మండలంలోని సీతానాగులవరంలో రీసర్వే భూములపై రెవెన్యూ అధికారులు మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు సమస్యలను అర్జీ రూపంలో తహసీల్దార్ దృష్టికి తీసుకొచ్చారు. రైతులు తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను ఉన్నతాధికారులకు తెలియజేసి పరిష్కరిస్తామని తహశీల్దార్ విజయభాస్కర్ తెలిపారు. సర్పంచ్ తాటికొండ అంజనేయులు, ఎంపీటీసీ అంకమ్మ, మండల సర్వేయర్ శ్రీవాణి పాల్గొన్నారు.

చెరువు నీటి వృథాను అరికట్టండి

కొమరోలు: చెరువు నుంచి వృథాగా పోతున్న నీటిని అరికట్టాలని ఏపీ రైతు సంఘం గిద్దలూరు నియోజకవర్గ సెక్రటరీ ఎం.చంద్రపాల్ తెలిపారు. మండలంలోని నల్లగుంట్ల చెరువుకు ఈమధ్య కురిసిన వర్షాలకు నీరు చేరింది. కానీ చెరువు నుంచి తూము ద్వారా వృథాగా నీరు పోతున్నదని, అక్రమంగా మోటార్ల ద్వారా చెరువులోని నీటిని పట్టుకుంటున్నారని చంద్రపాల్ తెలిపారు. వృథా నీటిని నివారించాలంటూ నల్లగుంట్ల గ్రామపంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు రామరాజు, వెంకటయ్య,పాల్గొన్నారు.

కలెక్టరమ్మా.. మీరే న్యాయం చేయాలి

మార్కాపురం టౌన్: అక్రమంగా తొలగించిన తమను వెంటనే విధుల్లోనికి తీసుకునే విధంగా అధికారులకు చెప్పి తమ కుటుంబాలను ఆదుకొని న్యాయం చేయాలని మున్సిపల్ కార్మికులు మంగళవారం కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వినతిపత్రం ఇచ్చారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో వెలుగొండపై సమీక్ష చేసేందుకు వచ్చిన ఆమెకు మున్సిపల్ కార్మికులు సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చారు.

భూసమస్యల పరిష్కారానికే గ్రామసభలు



కొండాయపాలెంలో రైతుల సమస్యలు వింటున్న అధికారులు

పొదిలి రూరల్: గ్రామాల్లో పేరుకుపోయిన భూసమస్యల పరిష్కారానికే గ్రామసభలు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ ఎంవీ కృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం పొదిలి మండలం కొండాయపాలెంలో రీసర్వే సమస్యలపై రైతులకు అవగాహన కలిస్తూ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ భూసమస్యలకు సంబంధించి రైతులు అర్జీలు అందజేస్తే పరిశీలించి పరిష్కార చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామసభలో వచ్చే సమస్యలు, పొలంలో ఇద్దరు ముగ్గురి మధ్య జాయింట్ పొలం సమస్యలు, ఉన్న భూమిలో హద్దులు సరిగ్గా లేక పోవడం, ఒకే భూమిని అందరు కలిసి సాగు చేసుకోవడంపై, పుస్తకంలో ఉన్న భూమి, పొలంలో ఉన్న భూమికి విస్తీర్ణంలో హెచ్చు తగ్గులు ఉండటం ప్రధాన సమస్యలని చెప్పారు. గ్రామసభలను సద్వినియోగం చేసుకోని భూసమస్యలు పరిష్కారించుకోవాలని కోరారు. సర్పంచ్ సన్నెబోయిన మాధవి, వీఆర్వో కిలారి సుబ్బారావు, సచివాలయం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు



కొనకనమిట్ల: కంది పైరును పరిశీలిస్తున్న అధికారులు



పొదిలి రూరల్: పంటను పరిశీలిస్తున్న అధికారులు



మార్కాపురం రూరల్: రైతులకు సూచనలిస్తున్న ఏఓ శ్రీనివాసులు



పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

పొదిలి రూరల్: తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించే విధానాలపై రైతులు దృష్టి పెట్టాలని ఏవో జైన్‌లాబ్దిన్ అన్నారు. మంగళవారం పొదిలి మండలం పాములపాడు, కుంచేపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంపై గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వచ్చే విధంగా పద్ధతులు పాటించాలని కోరారు. పంటలపై వచ్చే చీడ పీడలు, తెగుల నివారణకు యజమాన్య పద్ధతులు అవలంబించాలన్నారు. రబీ 2024–25 సంవత్సరానికి మినుము, శనగ, వరి, ఎండుమిరప, మొక్కజొన్న, జొన్న పంటలకు ప్రీమియం చెల్లించాలని కోరారు. ఖరీఫ్ 2024కు సంబంధించి పంట నమోదు ధృవ పత్రాలను రైతులకు అందజేశారు. వర్షాలతో దెబ్బతిన్న సజ్జపంట జాబితా ప్రదర్శించారు. రైతులు రాయితీపై యంత్ర పరికరాలు, టార్పాలిన్, సూక్ష్మపోషకాలైన జింక్, బోరాన్, జిప్సం కావాలని కోరాగా ప్రభుత్వం త్వరలో రాయితీ ఇస్తుందని చెప్పారు.

కొనకనమిట్ల: రైతులు సకాలంలో పంటను ఆశించే తెగుళ్ల మరియు పురుగుల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడులు సాధించేలా కృషి చేయాలని ఏఓ ప్రసన్న రంగలక్ష్మి అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని కొనకనమిట్ల, నాగరాజుకుంట రైతు సేవా కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో రైతులకు వ్యవసాయంలో తీసుకోవాల్సిన మెళకువలు వివరించారు. కంది, మినుము, అలసంద, వరి సాగు చేసిన పంటలలో మేలైన యాజమాన్య పద్ధతులు తెలియజేశారు. కంది, మిరప పంటలు ఆశించు తెగుళ్ల నివారణ గురించి వివరించారు. ఖరీఫ్ సాగులో పంటలు సాగు చేసిన రైతులకు రసీదులు అందజేశారు. కార్యక్రమంలో వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

మార్కాపురం రూరల్: మార్కాపురం రూరల్‌లో కందిసాగు చేసిన రైతులు వర్షాలకు యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయాధికారి దేవిరెడ్డి శ్రీనివాసులు సూచించారు. మంగళవారం ఆయన మండలంలోని గజ్జలకొండ, నాయుడుపల్లి గ్రామాల రైతులతో రబీ సీజన్ 2024–25 ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకంలో భాగంగా మినుము పంటకు ఒక ఎకరానికి 103 రూపాయలు రైతు వాటా కింద సీఎస్‌సీ ద్వారా ప్రీమియం చెల్లిస్తే నష్టం జరిగిన సమయంలో ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. ఉద్యానశాఖాధికారి రమేష్, ఆర్‌ఎస్‌కే సిబ్బంది జయంతి, నవీన్, రైతులు పాల్గొన్నారు.

రైతులు పంట బీమా ప్రీమియం చెల్లించాలి

గిద్దలూరు రూరల్: రైతులు వారు పండించే పంటలకు పంట బీమా ప్రీమియం చెల్లించాలని స్థానిక వ్యవసాయశాఖాధికారి విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని గడికోట, ఆదిమూర్తిపల్లె గ్రామాల పరిధిలో మంగళవారం రైతులకు వ్యవసాయ అనుబంధ శాఖల అంశాలపై అవగాహన కల్పించారు. రబీ సీజన్‌లో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన్ పథకం కింద రైతులు వారి అంతటవారే పంట బీమాకు రైతు వాటా ప్రీమియం చెల్లించాలన్నారు. శనగ, మినుము, వరి, జొన్న, మొక్కజొన్న, ఎండుమిరప మొదలైన పంటలకు బీమా పథకం వర్తిస్తుందని చెప్పారు. కంది పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో పట్టు పరిశ్రమశాఖ అధికారి వెంకటేశ్వర్లు, వ్యవసాయ విస్తరణాధికారి శ్రీనివాసరెడ్డి, సచివాలయ సిబ్బంది రాణాప్రతాప్, సురేఖ, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న అధికారులు

తర్లుపాడు: సీజనల్ వ్యాధులపై పంచాయితీ సెక్రటరీలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపీడీఓ చక్రపాణి ప్రసాద్ సూచించారు. మండలంలోని పంచాయతీ సెక్రటరీలు, వివిధ శాఖల అధికారులతో ఆయన మంగళవారం తన కార్యాలాయంలో సమావేశమయ్యారు. ప్రతి పంచాయతీలో వాటర్ ట్యాంకర్‌లు శుభ్రం చేసి కాలువల వెంబడి బ్లీచింగ్ చల్లించాలని ఆదేశించారు. ఈఓఆర్‌డీ సుకుమార్ మాట్లాడుతూ 30వ తేదీ నాటికి పింఛన్ పంపిణీ చేయాలని చెప్పారు. నవంబర్ ఒకటో తేదీ ఉదయం 6 గంటల నుంచి పంపిణీ చేయాలని చెప్పారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో భాగంగా చేపట్టిన బోర్ రీచార్జి, హార్టికల్చర్ మొక్కలు, గోకులం షెడ్ల నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలని ఏపీడీ భాస్కర్‌రావు కోరారు. ఏపీఓ కసుకుర్తి కొండయ్య, ఏఓ చంద్రశేఖర్, వీఆర్‌ఓలు, కార్యదర్శులు, పలువురు పాల్గొన్నారు.

సిండికేట్‌గా ఏర్పడకుండా నిరోధించాలి

పొదిలి: మద్యం దుకాణాలు దక్కించుకున్న యజమానులు సిండికేట్‌గా ఏర్పడకుండా ఎక్సైజ్ మరియు ప్రొహిబిషన్ అధికారులు నిరోధించాలని సీపీఐ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక స్టేషన్‌లో ఎస్సై సైమన్‌ను కలిపి వినతిపత్రం అందచేశారు. యజమానులు సిండికేట్‌గా ఏర్పడి బెల్ట్ షాపులు ఏర్పాటు, అధిక ధరలకు అమ్మటం కోసం సిండికేట్‌గా ఏర్పడే ప్రయత్నాలు జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఇష్టానుసారంగా బెల్టు షాపులు నడిపి ప్రజల ఆరోగ్యాన్ని ఫణంగా పెట్టి ధనార్జనే ధ్యేయంగా దుకాణాలు నడపకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం వారు ఇచ్చిన ఎంఆర్‌పీకి అమ్మేలా చూడాలని కోరారు. వినతిపత్రం సీపీఐ మండల కార్యదర్శి కె.వెంకటరత్నం ఆధ్వర్యంలో అందచేశారు.



వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు